క్లుప్తంగా

కార్మికుల ఐక్యతకు పరస కృషి



భీమవరంలో సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: నిరాడంబరత, త్యాగానికి ప్రతిరూపం పరస సత్యనారాయణ జీవితమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి మంతెన సీతారామ్ అన్నారు. పరస వర్ధంతిని సోమవారం స్థానిక యూటీఎఫ్ హాల్లో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుకునే వయసు నుంచి అనేక కష్టాలను ఒడిదుడుకులను ఎదుర్కొని సింగరేణి ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన పరస ప్రజా ఉద్యమాల కోసం ఉద్యోగాన్ని వదిలిపెట్టి కార్మికవర్గ ఐక్యత కోసం పనిచేశారని కొనియాడారు. తొలుత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేఎస్వీ గోపాలన్, బి.బలరామ్, జి.జేమ్స్, పట్టాభిరామయ్య, బి.వాసుదేవరావు, డి.కల్యాణి, ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

త్వరలో వాలీబాల్ శిక్షణా శిబిరాలు



కోపల్లె హైస్కూల్‌లో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాళ్ల: జిల్లాలో వాలీబాల్ క్రీడలకు ప్రోత్సాహం అందించేందుకు కోపల్లె వాలీబాల్ అకాడమీ కృషి చేస్తుందని అకాడమీ సభ్యులు తెలియజేశారు. ఈ మేరకు కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో వాలీబాల్ క్రీడోత్సవ బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ వాలీబాల్ అకాడమీ ఆధ్వర్యంలో పలుచోట్ల వాలీబాల్ కోచింగ్ క్యాంపులను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పెనుమత్స విశ్వనాథరాజు, ఇందుకూరి ప్రసాద్‌రాజు, దంతులూరి సత్యనారాయణరాజు, శ్రీనివాస్‌రాజు, రామరాజు పాల్గొన్నారు.

సైన్సుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



వేసవి విజ్ఞాన శిబిరలంలో విద్యార్థులకు సైన్స్‌పై బోధన చేస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ నూతన పోకడలతో ముందుకు వెళుతున్న తరుణంలో నేటి విద్యార్థులు సైన్సు విద్యతో ముందుకు వెళ్లాలని రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన బోధనలు చేశారు. సైన్సుపై ప్రతి విద్యార్థి అవగాహనతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుడు కిషోర్ సంగీతంపై అవగాహన కల్పించారు. సంగీతంతో మనస్సు ప్రశాంతత పొందడమే కాకుండా శరీరంలో పలు నాడులలో కదలికలు ఏర్పడతాయన్నారు. ఉపాధ్యాయుడు లోవరాజు తెలుగు పద్యాలు, లెక్కలపై పలు మెలకువలు, గ్రామర్ తెలియజేశారు. కార్యక్రమాన్ని గ్రంథ పాలకురాలు పార్వతి పర్యవేక్షించారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.12 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మవారి హుండీ ఆదాయం 55 రోజులకు రూ.12,65,114 లభించినట్టు భీమవరం సుబ్రహ్మణ్యేశ్వర సామి ఆలయం ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. సోమవారం హుండీ ఆదాయం లెక్కింపును ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆల య చైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యు లు, మాజీ చైర్మన్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ: వడలిలోని సాయి అగస్త్యేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలోని సాయినాథుని ఆలయ ఆరో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఈదల మోనికాదేవి, కృష్ణ దంపతులు సాయి నాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక హరతులిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం

- గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- రాయలంలో సచివాలయ నూతన భవనం, సీసీ రోడ్డు ప్రారంభం



రాయంలో నూతన సచివాలయ భనవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందిస్తూ సాకారం చేశారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలోని సాయిబాబా గుడి రోడ్‌లో రూ.65 లక్షల 30 వేలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.45 లక్షల 70 వేలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో గ్రామాలలో బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఇళ్ల స్థలాల పట్టాలు, కుల ధ్రువీకరణ తదితర సేవలు పొందాలంటే కాళ్లు అరిగేలా తిరిగేవారని గుర్తు చేశారు. దీంతో సమయం, డబ్బు వృధా అయ్యేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ప్రతి 2 వేల జనాభా గల గ్రామానికి సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఎనిమిది మంది వివిధ శాఖల సిబ్బందిని నియమించి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్‌ను పెట్టి మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా అవినీతి అక్రమాలకు తావులేకుండా స్వచ్ఛమైన పాలనను అందిస్తున్నారన్నారు. సచివాలయాలు ద్వారా సుమారు 630 పైగా సేవలు అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదర్శ పాలనను సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయిన్లు, జల జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటి ముంగిటకే అందజేస్తున్నామన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు నిత్యం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జిల్లా మండల పరిషత్ చాంబర్ అధ్యక్షులు పేరిచర్ల విజయనరసింహరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఉభయగోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకటరాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సీనియర్ నాయకులు తోట నాగు, చినిమిల్లి నాగన్న, పంచదార శ్రీను, చెల్లబోయిన బుజ్జి, కండిబోయిన వాసు, చిప్పాడ శివకాశీ, దొంగా రామకృష్ణ, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, కామన నాగేశ్వరరావు, రాట్నాల రామకృష్ణ స్వామి, కోళ్ల బాలకృష్ణ, నాగిడి నారాయణ స్వామి, కోమటి రాంబాబు, నామన మహేష్, ఏఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి



మృతి చెందిన గేదె

ఉండి: విద్యుత్‌షాక్‌కు గురై ఉండిలో ఓ గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉండి రాజులపేట కల్యాణ మండపం సమీపంలో ఓ గేదె పచ్చిక మేస్తోంది. అదే ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు గేదె రాగా అక్కడ కిందికి వేలాడుతున్న విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.1.20 లక్షల విలువ చేసే తన గేదె మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, తనకు న్యాయం చేయాలని రైతు అప్పన్న వాపోయాడు. గత కొంతకాలంగా ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో డేగాపురంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5 వేల 40 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హామీలు నెరవేర్చడంతో సంతోషంగా ప్రజలు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- వేండ్రలో గడపగడపకు మన ప్రభుత్వం



వేండ్రలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పాలకోడేరు: వేండ్ర గ్రామంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నాలుగో రోజుకు చేరుకుంది. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మండుటెండను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ తిరిగి ప్రజలను పలకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ, వారి సమస్యలను వింటూ ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు పీవీఎల్‌ను అనుసరిస్తున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ జగన్‌మోహనరెడ్డి నెరవేర్చడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండానే తమకు ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయని చెప్పారన్నారు. అందుకే తామంతా మరలా జగనన్ననే ముఖ్యమంత్రిగా రెండోసారి చేసుకుంటాం అని అంటున్నారని అన్నారు. జగన్ అధికారంలోకి రాకపోతే ఈ పథకాలు ఆగిపోతాయన్న భయాందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో వేండ్ర గ్రామం టీడీపీకి మద్దతుగా నిలిచిందని, అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తోందని ఇంటింటికి తిరుగుతుంటే అర్థమవుతోందన్నారు. మంగళవారంతో ఈ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవుతుందని, ఇక్కడ ప్రజలు అడిగిన డ్రెయినేజీ సమస్యలు, తదితర అభివృద్ధి పనులను త్వరలో చేపడతామన్నారు. ఉదయం నుంచి మండుటెండలను సైతం లెక్కచేయకుండా నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి పాలన గురించి ఆరాతీయడంలో, సమస్యలను తెలుసుకోవడంలో ఎంతో సహకరించారని వారికి అభినందనలు తెలిపారు. ఇప్పట్లో ఎన్నికలు లేకపోయినా నాయకులు తమ వద్దకు రావడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని, గతంలో నాయకులు ఎన్నికలప్పుడు ముఖాలు చూపించే వారనీ గుర్తు చేశారని పీవీఎల్ వెల్లడించారు. ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతుంటే ప్రజల్లో మంచి స్పందన కనిపిస్తోందని, రాబోయే ఎన్నికల్లో పీవీఎల్‌ను గెలిపించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి నాగేశ్వరి, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, పెన్మత్స శ్రీనివాసరాజు, వీగి రమణ, ఎస్.వేణు, బుడితి నాగరాజు, అసినిపర్తి శేఖర్, జి.కిరణ్, వీరవల్లి కృష్ణ, నేలపాటి రాజబాబు, కే రాంబాబు, బి.నాగరాజు, సీహెచ్ చిట్టిబాబు, శివకోడు హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు పాలాజ్యోతి, కె.వెంకట నాగలక్ష్మి, షేక్ పాపా సాహెబ్, వైస్ ఎంపీపీలు ఆదాడ లక్ష్మీ తులసి, షోడదాసి నరేష్, గెడ్డం జోషి, బొక్కా రాంబాబు, పాలా రాధాకృష్ణ, సర్పంచ్‌లు బొల్లా శ్రీనివాస్, చింతపల్లి చిన్నా నాయకులు కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మోషేన్‌రాజును కలిసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారావును సత్కరిస్తున్న మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగళ్ల వెంకట రమణారావు ఆధ్వర్యంలో కొత్త పాలకవర్గం సోమవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును భీమవరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఎన్నికైన నాయకులు మోషేనురాజును కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణారావును మోషేనురాజు దుశ్శాలువాతో సత్కరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పాకా రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ మేకా శివ, కోశాధికారి బడుగు అశోక్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు సునీల్, చంద్రశేఖర్ వంశీ, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జవ్వాది సత్తిబాబు, న్యాయవాదులు తాడిమళ్ళ గిరి, బొక్కా దామోదర్ రావు, అడబాల శ్రీనివాసరావు, అల్లూరి శివాజీరాజు, వేణు, నీలాతి రమేష్ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన కొత్త లెక్చరర్లు



ఉండి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకున్న కొత్త లెక్చరర్లు

ఉండి: గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా ఉండిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి గత ఏడాది తరగతులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయి లెక్చరర్ల బృందం అందుబాటులోకి వచ్చింది. సోమవారం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బేబీ సమక్షంలో జీ రాము (తెలుగు), ఎం.సూర్యకుమారి (ఇంగ్లిష్), బీ రవిశంకర్ (మ్యాథ్స్), జీ ఆంజనేయ స్వామి (ఫిజిక్స్), కే కృష్ణకుమార్ (కెమిస్ట్రి), ఎస్వీ సత్యనారాయణ (బోటనీ), పీ విజయభాస్కర్ (జువాలజీ) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పక ఉపయోగించుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో అధ్యాపక బృందం అందుబాటులో ఉండటంతో ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధిస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు సత్కారం



ఉండి జెడ్పీ హైస్కూల్‌లో మెరిట్ విద్యార్థులను సత్కరించిన హెచ్‌ఎం బేబీ తదితరులు

ఉండి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఉండి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బేబీ అన్నారు. సోమవారం హైస్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులు కొక్కిరిగడ్డ స్రవంతి (523), పీ యశ్వస్విని (520), తొర్లపాటి సంజన(503) వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో విద్యార్థులు ఉత్తమంగా చదువుతున్నారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి కార్యక్రమాలతో విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధిస్తున్నాయంటే దాని వెనుక రాష్ట్ర ప్రభుత్వ కృషి ఎంతైనా ఉందన్నారు. అలాగే ఉండి హైస్కూల్‌లో ఉత్తమ విద్యాబోధన అందుతోందని, అందుకే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదవాలంటే ఒకవైపు ఉపాధ్యాయులు, మరోవైపు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ హెచ్‌ఎం అక్బర్ చక్రవర్తి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ గొల్లపల్లి కోమలి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఏఐఎస్‌ఎఫ్ శిక్షణా తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

సాక్షి, భీమవరం: భీమవరంలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఏఐఎస్‌ఎఫ్ కోస్తాంధ్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సోమవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులలో మూఢత్వాన్ని పారదోలి శాస్త్రీయతను, అభ్యుదయ, ప్రగతిశీలక భావాలను పెంపొందించడంతో పాటు విద్యారంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కాపాడుకోవాల్సిన బాధ్యత తదితర అంశాలపై శిక్షణా తరగతుల్లో బోధిస్తామన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో పేదలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తోందని విమర్శించారు. భారతీయ చరిత్రను వక్రీకరిస్తూ పాఠ్యాంశాల్లో మతోన్మాద భావాలను పొందుపరుస్తున్నారని వక్రపూరిత విధానాలు ప్రతిఘటిస్తూ విద్యారంగాన్ని, చరిత్రను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అప్పలస్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, మండల కార్యదర్శి మల్లుల సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత



ఉండి గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ అందిస్తున్న దాతలు, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఉండి: చివరి మజిలీ ఎవరికీ ఇబ్బందికరంగా మారకూడదనే ఉద్దేశంతోనే నియోజకవర్గ కేంద్రం ఉండికి ఫ్రీజర్ బాక్స్ అందించామని ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు దంగేటి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ద్వారంపూడి అమ్మిరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల పేరున వారి కుమారుడు నారాయణరెడ్డి అందించిన ఫ్రీజర్ బాక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఎస్సై కే గంగాధరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సేవాసంస్థ ద్వారా చాలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు వారిని అభినందిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, సహాయం వంటి సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తూనే అంతిమ సంస్కారాలకు అత్యవసరమైన ఫ్రీజర్ బాక్స్‌ను దాతల సహకారం తీసుకుని అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మానవత డైరీని నాయకులు ఆవిష్కరించారు. సత్తి బ్రహ్మారెడ్డి, మానవత నియోజకవర్గ కన్వీనర్ కొమ్మన నాగబాబు, జిల్లా నాయకుడు యువరాజు, సభ్యులు రామచంద్రరావు, సత్యనారాయణ, మానే ప్రసాద్, మాజీ అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

చెరువు తవ్వకం పనులు ప్రారంభం

పోడూరు: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ కూలీలకు సూచించారు. పండితవిల్లూరు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చెరువు తవ్వకం పనులను సోమవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి పనుల ద్వారా కూలీలందరికీ ఎక్కువరోజులు పనులు ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఉపాధిహామీ పనులు సజావుగా జరిగేలా శ్రద్ధ చూపాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారన్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక, సొసైటీ చైర్మన్ గెద్దాడ ఏకలవ్య, ఎంపీటీసీ ఇందుకూరి సూర్యాకాంతం, గ్రామకమిటీ అధ్యక్షుడు జక్కంశెట్టి రఘు, పంచాయతీ కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపారావు నాయుడు సేవలు అభినందనీయం

పాలకొల్లు అర్బన్: పేదలకు విద్య, వైద్య, సామాజిక సేవలు అందించడంలో పాపారావు నాయుడు అభినందనీయుడని లయన్స్ పూర్వ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ రెండో వైస్ గవర్నర్‌గా ఎన్నికైన సన్‌షైన్ స్కూల్ అధిపతి ఎస్వీవీఎస్ పాపారావు నాయుడిని స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి మాజీ గవర్నర్ పంకజాక్షన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ సభ్యులందర్నీ ఒక వేదికపైకి తీసుకురావడంతో మరిన్ని క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పాపారావునాయుడు, అరుణానాయుడు దంపతులను గజమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. శిడగం సతీష్, సొలస రాంప్రసాద్, కారుమూరి రామలింగేశ్వరరావు, అధికారి కృష్ణ, కొమ్ముల మురళీకృష్ణ, దేవత రవి, ప్రవీణ్‌భాను పాల్గొన్నారు.

బీసీల మద్దతుతోనే ప్రభుత్వాల ఏర్పాటు

మొగల్తూరు: బీసీలు మద్దతిస్తేనే కేంద్రంలోనైనా, రాష్ట్రాల్లోనైనా ప్రభుత్వాలు ఏర్పాటవుతాయనడానికి నిదర్శనమే ఇటీవల కర్నాటక ఎన్నికల ఫలితాలని ఆల్ ఇండియా ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మొగల్తూరు వచ్చిన ఆయనను స్థానిక బీసీ నాయకులను కలిశారు. కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో బీసీలు కీలక పాత్ర పోషించారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు కచ్చితమైన హామీలిచ్చే పార్టీలకు మద్దతు ఇచ్చి గెలుపించుకునేందుకు కలిసికట్టుగా ఉండాలని సూచించారు.

నేడు వేండ్రలో గడపగడపకు మన ప్రభుత్వం

పాలకోడేరు: మండలంలోని వేండ్ర గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) సోమవారం చెప్పారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

23 నుంచి వలంటీర్లకు సన్మానం

ఆకివీడు: మండలంలో ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకూ ఆయా గ్రామాల్లోని అవార్డులు పొందిన వలంటీర్లకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని 12 గ్రామాల్లోని వలంటీర్లతో పాటు సేవా రత్న, సేవా మిత్ర, పొందిన వారికి సర్టిఫికెట్స్, మెడల్స్, బాడ్జిలతో పాటు దుశ్శాలువాతో సత్కరిస్తారరన్నారు.

స్పందనలో 4 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో నాలుగు ఫిర్యాలు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. పట్టణంలోని కాఫీ హోటల్స్‌లోని కార్మికులకు లేబర్ యాక్టు అమలు చేయాలని, నగర పంచాయతీ పరిధిలోని ఆస్తులను రక్షించాలని, ఆక్రమణల్ని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిన ఆక్రమణల్ని స్వాధీనం చేసుకోవాలని, పట్టణంలోని పెద్దింటి అమ్మ, మదనగోపాలస్వామి దేవస్థానం ఆదాయ, వ్యయాలు తెలపాలని ఫిర్యాదులు అందాయన్నారు. స్థానిక జాతీయరహదారికి చేర్చి దుంపగడప గ్రామంలో ఉన్న ఆక్రమణల తొలగింపుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలును వాయిదా వేయాలని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు.

పాలకోడేరు పంచాయతీ సమావేశం

పాలకోడేరు: పాలకోడేరు గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం సర్పంచ్ ఇంజేటి మరియమ్మ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలు, సమస్యలపై సభ్యులు చర్చించారు. పంచాయతీ కార్యదర్శి రమాలీల, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శిథిల వంతెన పునర్నిర్మాణానికి చర్యలు



ఉండిలో వంతెనను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కల్యాణ్‌వర్మ

ఉండి: ఉండి రైల్వేస్టేషన్ రోడ్డులో పంటకాలువపై శిథిలావస్థకు చేరిన వంతెనను పంచాయితీరాజ్ డీఈ కేఎస్ శ్రీనివాసరావు, సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ సోమవారం పరిశీలించారు. వంతెనను 1933లో నిర్మించిన ఈ వంతెనను 60 ఏళ్ల క్రితమే అనగా 1993లోనే తొలగించాల్సి ఉందని డీఈ అన్నారు. అయితే వంతెన కింద ఉన్న పిల్లర్లు బలంగా ఉండటంతో వాటిని అలాగే ఉంచి శిథిలమైన పైభాగాన్ని తొలగించి భీమ్‌లు పోసి పైన స్లాబ్ వేస్తే వంతెన మరింత కాలం మన్నుతుందన్నారు. గ్రామంలోని ఐదు వార్డుల ప్రజల రాకపోకలకు ఈ వంతెనే ఆధారమని, దీనిని త్వరగా పునర్నిర్మాణం చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. త్వరలోనే అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపి మంజూరు జరిగేలా చర్యలు తీసుకుంటామని డీఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలతో నైతిక విలువలు

నరసాపురం: నీటి కథలు పిల్లలకు నైతిక విలువలు నేర్పుతాయని సైంటిస్ట్ ఆర్వీ సుబ్బారావు అన్నారు. నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా సోమవారం పిల్లలకు నీతి కథలు నేర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ పద్యాలు, నీతి కథలు, సామెతల్లో అనేక సైన్స్‌కు సంబంధించిన విషయాలు దాగి ఉన్నాయన్నారు. పిల్లలకు పుస్తకాలు చదవడం నేర్పించాలని చెప్పారు. శిక్షణలో భాగంగా యోగా, చెస్, డ్రాయింగ్, డాన్స్ వంటి అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు విజయవంతంగా సాగుతున్నాయని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి తెలిపారు.